## అమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలి

**రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి**



రంగంపేటలో దుర్గామాతకు పూజలు చేస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

కొల్చారం, అక్టోబర్ 17 : అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. కొల్చారం మండలం రంగంపేట, ఎనగండ్ల గ్రామాల్లో మంగళవారం దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో బోనాల ఊరేగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఆమెను సన్మానించారు. పేదల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం కేసీఆర్ నేతృత్వంలో మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపడుతుందన్నారు. ఆమె వెంట ఎంపీపీ కొరబోయిన మంజుల, మాజీ ఎంపీపీ అరిగె రజిని రమేశ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నేత గౌరిశంకర్, సర్పంచ్‌లు బండి సుజాత, మాధవి, వీరారెడ్డి, నాయకులు వేమారెడ్డి, రవీందర్‌గౌడ్, పెంటారెడ్డి, సాయిబాబాగౌడ్, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 30, 31న స్థాయీసంఘ సమావేశాలు

మెదక్ అర్బన్, అక్టోబర్ 17 : జిల్లా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 30, 31 తేదీల్లో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయీ సంఘ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న స్థాయీ సంఘ సమావేశం-3 వ్యవసాయం గురించి ఉదయం-11 గంటలకు, స్థాయీ సంఘ సమావేశం-5 స్త్రీ, శిశు సంక్షేమం మధ్యాహ్నం 2 గంటలకు, స్థాయీ సంఘ సమావేశం-6 సాంఘీక సంక్షేమం మధ్యాహ్నం 3 గంటలకు, స్థాయీ సంఘ సమావేశం-2 గ్రామీణాభివృద్ధి ఈ నెల 31 ఉదయం 10:30 గంటలకు స్థాయీ సంఘ సమావేశం-4విద్య, ఆరోగ్యం మధ్యాహ్నం 12 గంటలకు, స్థాయీ సంఘ సమావేశం-1 ఆర్థిక, ప్రణాళిక, మధ్యాహ్నం 2 : 30 గంటలకు, స్థాయీ సంఘ సమావేశం-7 పనుల గురించి మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

# ఓటరుగా నమోదు చేసుకోవాలి

**నందిగామలో పోలింగ్ కేంద్రాలను సందర్శించిన మెదక్ ఎన్నికల అధికారి రాజర్షిషా**



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా

నిజాంపేట, అక్టోబర్ 17: 18 ఏండ్లు నిండిన యువత ఈ నెల 31తేదీ వరకు ఓటు హక్కు కోసం బీఎల్వోల వద్ద నమోదు చేసుకోవచ్చని మెదక్ ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా సూచించారు. నవంబర్ 30న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నిజాంపేట మండలం నందిగామలోని రెండు పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా మంగళవారం సందర్శించి గ్రామ ఓటర్ లిస్టును పరిశీలించారు. అసెంబ్లీ ఎన్నికలకు ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అందరూ సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో అంబదాసు రాజేశ్వర్,తహసీల్దార్ సురేశ్ కుమార్, ఎంపీడీవో జగదీశ్వర్,ఎంపీవో రాజేందర్, ఆర్ఐ గంగాధర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి ఆరిఫ్ హుస్సేన్,పీఆర్ డీఈ పాండురంగారావు, ఏఈ శరత్, బీఎల్వోలు రామలక్ష్మి,నాగరాజు తదితరులు ఉన్నారు.

# 80 ఏండ్లు దాటితే.. ఇంటి నుంచే ఓటు


- వయోవృద్ధులు, దివ్యాంగులకు అవకాశం
- నవంబర్ 7 వరకు 12డీ ఫాం అందజేత

మెదక్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ) : వచ్చే నెల 30న నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల్లో దివ్యాంగులు, 80 ఏండ్ల పైబడిన వృద్ధులు ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కేంద్ర ఎన్నికల సంఘం కల్పిస్తున్నది. ఇటీవల కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఈ విధానం విజయవంతం కావడంతో రాష్ట్రంలోనూ అమలుకు ఎన్నికల కమిషన్ చర్యలు చేపడుతున్నది. ఈ నెల 4న ఎన్నికల కమిషన్ ప్రకటించిన ఓటర్ల తుది జాబితా ప్రకారం మెదక్ జిల్లాలో 4,34,275 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో వయో వృద్ధు లు 4151 మంది, దివ్యాంగులు 8863 మంది ఉన్నారు. ఇలాంటి వారు ఇంటి వద్దనే తమ ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు చర్య లు చేపడుతున్నారు.

**అందుబాటులోకి డీ-12 ఫారం..**

ఎన్నికల కమిషన్ ప్రతి పోలింగ్ కేంద్రంలో వారం ముందుగానే డీ-12 ఫారం అందుబాటులోకి తెచ్చింది. ఓటరు జాబితాలో పేరు కలిగిన 80 ఏండ్లు పైబడిన వయోవృద్ధులతోపాటు 40 శాతానికి మించి వైకల్యం కలిగిన దివ్యాంగులు ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఇందుకోసం సంబంధిత బీఎల్‌వోల వద్ద 12 డీ ఫారంలో తమ పూర్తి వివరాలు నమోదు చేసి నవంబర్ 7వ తేదీలోపు బీఎల్‌వోలకు అందజేయాలి. ఇలా అందజేసిన వారికి ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.

**ఓటింగ్ శాతం పెంచేందుకే ప్రచారం..**



నవంబర్ 30న రాష్ట్రంలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ అన్ని జిల్లాల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు ఇప్పటి నుంచే ప్రచారం నిర్వహిస్తున్నది. మెదక్ జిల్లాలో మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో మొత్తం 4,34,275 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 2,24, 337 మంది మహిళలు, 2,09,927 మం ది పురుషులు, ఎన్ఆర్ఐ ఓటర్లు 9, సర్వీస్ ఓటర్లు 124 మంది ఉన్నట్లు అధికారులు జాబితాను విడుదల చేసిన విషయం తెలిసిందే. మెదక్ నియోజకవర్గంలో 274 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 2,14,064 మంది ఉండగా, అందులో 1,02, 340 మంది పురుషులు, 1,11,720 మంది మహిళలు, ఇతరులు 85 మంది ఉన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో 305 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 2,20,211 మంది ఉండగా 1,07, 587 మంది పురుషులు, 1,12,617 మంది మహిళలు, ఇతరులు 39 మంది ఉన్నట్లు అధికారికంగా ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా 80 ఏండ్లకు పైబడిన వారు 4151 మంది కాగా, దివ్యాంగులు 8863 మంది ఉండడంతో వీరందరికీ డీ-12 ఓటు విధానంపై అవగాహన కల్పిస్తున్నారు.

# ఆడబిడ్డగా ఆదరించండి

- అవకాశవాదులను దగ్గరికి రానివ్వొద్దు
- మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి
- కాంగ్రెస్ నుంచి 300మంది బీఆర్ఎస్‌లో చేరిక

**మూడోసారి అవకాశం ఇస్తే ఆదర్శంగా తీర్చిదిద్దుతా..**



బీఆర్ఎస్‌లో చేరిన నాయకులతో ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి

మెదక్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల్లో అవకాశవాదులకు అవకాశం ఇవ్వకుండా, ఆడబిడ్డగా ఆదరించి మరోసారి అవకాశం ఇస్తే మెదక్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో హవేళీఘనపూర్ మండల పరిధిలోని ముత్తాయిపల్లి, నాగారం, చిన్నశంకరంపేట మండల పరిధిలోని అంబాజీపేట గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు 300 మంది మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికీ ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గతంలో ఇక్కడ ఎమ్మెల్యేగా పనిచేసిన వారు పదవీ కాలంలో కూడా నియోజకవర్గాన్ని గాలికి వదిలేశారని ఆరోపించారు. 13 ఏండ్ల పాటు నియోజకవర్గ ప్రజల కష్టసుఖాలు తెలుసుకోకుండా ఎన్నికల రాగానే కొడుకును తీసుకువస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధితోపాటు ప్రజాసంక్షేమానికి సమప్రధాన్యతనిస్తున్న సీఎం కేసీఆర్ మరోసారి అధికారంలోకి వస్తే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నదన్నారు. ఇతర పార్టీలో నుంచి చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని, కొత్త, పాత అని తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా పార్టీ కోసం పని చేయాలని కోరారు. కార్యక్రమంలో మెదక్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి, హవేళీఘనపూర్ ఎంపీపీ శేరి నారాయణరెడ్డి, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, హవేళీఘనపూర్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ నాయకులకు కండువా కప్పుతున్న ఎన్నికల ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

## సివిల్ సప్లై గోదాం ఆకస్మిక తనిఖీ

**రికార్డులను పరిశీలించిన జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షిషా**



రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షి షా

రామాయంపేట, అక్టోబర్ 17 : రామాయంపేట పట్టణంలోని సివిల్ సప్లై గోదాంను జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షిషా ఆకస్మిక తనిఖీ చేపట్టారు. మంగళవారం రామాయంపేట మండలం డి.ధర్మారం గ్రామంలోని సీఎం ఓఎస్డీ రాజశేఖర్‌రెడ్డి తల్లి మృతిచెందడంతో ఆయనను గ్రామంలో పరామర్శించి, నేరుగా రామాయంపేటలో కొంత కాలంగా అవకతవకలు జరుగుతున్న సివిల్ సప్లై గోదాంను ఆకస్మికంగా తనిఖీ చేపి రికార్డులను పరిశీలించారు. అక్కడే ఉన్న జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూశాఖ అధికారి వెంకటేశ్వర్లును వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట మెదక్ ఆర్డీవో అంబదాస్, రామాయంపేట తహసీల్దార్ రజినీ కుమారి, ఆర్ఐ రాజు తదితరులు ఉన్నారు.

**ఎన్నికలపై అధికారులు అవగాహన కలిగి ఉండాలి**

నర్సాపూర్, అక్టోబర్ 17 : ఎన్నికల నిర్వహణపై అధికారులు ప్రతి విషయంపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం నర్సాపూర్ పట్టణ సమీపంలోని బీవీఆర్ఐటీ కళాశాలలో నియోజకవర్గ పరిధిలోని సెక్టోరియల్, నోడల్ అధికారులకు పోలింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని మాస్టర్ ట్రైనీలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాజర్షిషా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్‌లోకి ఫోన్లు అనుమతి లేదని, ఈసీఐ ఆథరైజ్డ్ పొందిన విలేకరులకు మాత్రమే అనుమతి ఉందని వెల్లడించారు. ఈవీఎంలను సిద్ధం చేయడం, పోలింగ్ నిర్వహణ, ఈవీఎంల రవాణా, మాక్ పోలింగ్, రూట్ ఆఫీసర్ తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. నర్సాపూర్ ఆర్డీవో శ్రీనివాసులు, తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర, నోడల్ అధికారులు,ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.